క్లుప్తంగా

నేడు జగన్ జన్మదిన వేడుకలు

ఎస్.రాయవరం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం అడ్డురోడ్డు కేంద్రంగా నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద కేక్ కట్, ఎస్.రాయవరం శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్న సమారాధన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరై ఈ వేడుకలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సత్వరం పెండింగ్ కేసుల పరిష్కారం



కోటవురట్ల పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న డీఎస్పీ మోహనరావు

కోటవురట్ల: నర్సీపట్నం డీఎస్పీ మోహనరావు స్థానిక పోలీసు స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. పాతకేసుల వివరాలను ఎస్‌ఐ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్‌ఐకు సూచించారు. ఫిర్యాదుదారుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. నిఘా పెంచి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రధాన కూడళ్లలో తరచుగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో పర్యావరణ హితం కోరుతూ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి సీఐ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ



మోడల్ పేపర్లు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాయకరావుపేట: మండలంలోని ఎస్.నర్సాపురం జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు సమకూర్చిన మోడల్ టెస్ట్ పేపర్లను శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు జి.గోవిందరావు పంపిణీ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు దేవవరపు రఘు, తేజోమూర్తుల కృష్ణశర్మ, మేడిశెట్టి పెంటయ్య, కాగ్రా రాధారాణి సహకారంతో 125 మంది విద్యార్థులకు యూటీఎఫ్ ప్రచురించిన ఈ మోడల్ టెస్ట్ పేపర్లను అందించినట్టు హెచ్‌ఎం తెలిపారు.

వర్షంతో రద్దయిన తిరువీధి సేవ

నక్కపల్లి: ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరగాల్సిన తిరువీధి సేవ లు వర్షం కారణంగా రద్దయ్యాయి. ఉదయం స్వామివారితోఅమ్మవారిని పట్టుపీతాంబరాలతో అలంకరించారు. దూప దీప నైవేద్యాలు, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. ఆలయంలోనే పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై పాశురాలను విన్నపం చేశారు.

10 లీటర్ల సారా స్వాధీనం



ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనం, నాటుసారా

పాయకరావుపేట: మండలంలోని గోపాలపట్నం ఆవ బ్రిడ్జి వద్ద సారా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. అతని వద్ద నుంచి 10 లీటర్ల సారాతోపాటు ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని యలమంచిలి కోర్టు ఆదేశాల మేరకు సబ్ జైలుకు తరలించామని సీఐ తెలిపారు.


మేలుకొలుపుతో ఆధ్యాత్మికత



కె.వెంకటాపురంలో మేలుకొలుపు చేస్తున భక్తులు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో శుక్రవారం తెల్లవారుజామున మేలుకొలుపు ఘనంగా నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయక పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని రామాలయంలో పూజలు చేసి దేవుడి చిత్రపటాలతో వీధుల్లో నగర సంకీర్తన చేశారు. భజన చేస్తూ మహిళలు ఆలపించిన కీర్తనలు అలరించాయి.

చివరికి అపార నష్టం



జల్లూరులో వర్షానికి తడిసిన వరి పనలు



మూలపేటలో తడిసిన పనలను పరిరక్షించుకుంటున్న రైతు



గవర్ల అనకాపల్లిలో తడిసిన వరి చేను

మునగపాక/కోటవురట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంటకు అపార నష్టం వాటిల్లింది. కోసిన వరి పనలు తడిసిపోవడంతో ఏం చేయాలో తెలియక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వేలాది రూపాయల పెట్టుబడులు చేసి వరి సాగు చేస్తే అకాల వర్షాలు ఇలా నట్టేట ముంచేశాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు తుపాను హెచ్చరికలు చేసినప్పటికీ కొందరు రైతులు అప్పటికే కోతలు పూర్తి చేశారు. కొందరు రైతులు వెనువెంటనే కుప్పలు వేయగా.. మరికొంత మందికి కూలీలు దొరకక వరి పనలు పొలాల్లోనే ఉండిపోయాయి. దాంతో వర్షపు నీటికి వరి పనలు తడిసిపోతున్నాయి. నీరు బయటకు పోయే దారి లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. జల్లూరు, యండపల్లి, అన్నవరం, కె.వెంకటాపురం, లింగాపురం, కోటవురట్ల, రాజుపేట, కైలాసపట్నం తదితర ప్రాంతాలలో వందలాద ఎకరాలలో వరి పనలు వర్షానికి తడిసి పాడవుతున్నాయి. ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని బాధిత రైతులకు ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి



తడిచిన వరి పనలపై ఉప్పు ద్రావణం పిచికారీని పరిశీలిస్తున్న అధికారులు

యలమంచిలి రూరల్: అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు కోసిన వరి పనలు తడిస్తే వెంటనే ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని యలమంచిలి వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.ప్రభాకర్ సూచించారు. శుక్రవారం యలమంచిలి పెంజెరువు సమీపంలో పంట పొలాల్లో కోసిన వరి పనలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. తడిచిన వరి పనలపై ఒక లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పును కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. దీని వల్ల ధాన్యం రంగు మారకుండా ఉండడంతో పాటు, మొలకలు రావన్నారు. వరి కుప్పలపై టార్పాలిన్లను కప్పి ఉంచాలని ఏవో పాలిమేర మోహన్‌రావు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు అరుణ, దేముడు, రైతు నగిరెడ్డి కాసుబాబు పాల్గొన్నారు.

తడిసిన వరి పనల పరిశీలన



మునగపాకలో తడిసిన వరి పనలు పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి

మునగపాక: తడిసిన వరి పనలను సంరక్షించుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్న కుమారి కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు మునగపాకలో తడిసిన వరి పనలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడిసిన వరి పనలను కాపాడుకునేందుకు లీటరు నీటిలో 50 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకు వరికోతలు చేపట్టరాదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మి, వీఏఏలు సింధూజ, పవన్, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి



యలమంచిలిలో దిమిలి రోడ్డు కూడలి వద్ద నిరసన తెలియజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



యండపల్లిలో కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసన తెలుపుతున్న మహిళలు, తదితరులు

యలమంచిలి రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా పార్లమెంట్‌లో మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అభి డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా యలమంచిలి పట్టణంలోని దిమిలి రోడ్డు కూడలి వద్ద శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద అమిత్ షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమిత్ షా వ్యాఖ్యలు బీజేపీ అహంకారానికి నిదర్శనంగా నిరసనకారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యలమంచిలి, పాయకరావుపేట డివిజన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

కోటవురట్ల: అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనలు వెల్లువెత్తాయి. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో శుక్రవారం యండపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న మహిళలు అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు రావాడ రత్నం, వార్డు మాజీ మెంబర్ జి.పద్మ, స్థానికులు డి.అప్పారావు, ఈశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

బాల కార్మికులతో పని చేయిస్తే కేసులు



ఎస్.రాయవరంలో తనిఖీ చేస్తున్న కార్మికశాఖ అధికారి వెంకటేశ్వరరావు, తదితరులు

ఎస్.రాయవరం: దుకాణాలు, హోటళ్లు, బేకరీలలో బాల కార్మికులతో పనులు చేయిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని కార్మికశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలో యలమంచిలి కోర్టు పర్యవేక్షణలో ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎస్.రాయవరం, పి.ధర్మవరం తదితర గ్రామాల్లో పర్యటించి హోటళ్లు, బేకరీలను తనిఖీలు చేశారు. బాల కార్మికులతో పనుల చేయించడం నేరమని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో యలమంచిలి కోర్టు న్యాయవాది టి.నూకరాజు, ఎన్‌జీవో చిన్నారావు, బాలల పరిరక్షణ ప్రతినిధి లోవరాజు, ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, వీఆర్వో నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పరిష్కారం



అరట్లకోటలో తహసీల్దార్ సత్యనారాయణకు సమస్యలు విన్నవిస్తున్న రైతులు



గొట్టివాడ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దారు తిరుమలబాబు

పాయకరావుపేట: రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూసమస్యలపై అందించిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ జి.సత్యనారాయణ తెలిపారు. రెండో విడత రెవెన్యూ సదస్సులో భాగంగా శుక్రవారం అరట్లకోట గ్రామంలో సభలో ఆయన గ్రామానికి చెందిన పలువురు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. భూములు కొలతలు, సరిహద్దులు, పాస్ పుస్తకాలు తదితర అంశాలపై దరఖాస్తులు అందాయి. రైతులు సమస్యలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని తహసీల్దార్ ఆదేశించారు.

కోటవురట్ల: గొట్టివాడలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు తిరుమలబాబు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దారు మాట్లాడుతూ భూ సమస్యలపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్యలు ఉంటే తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని, వివాదాల జోలికి పోవద్దన్నారు. ఈ సదస్సులో 17 అర్జీలు వచ్చినట్టు తెలిపారు.

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. డీటీ పడాల్, వీఆర్వో రమేష్, సర్వేయర్ సాయి, రైతులు భీమరశెట్టి కృష్ణారావు, కాండ్రేగుల జగన్, తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొట్టుముక్కల శిరీష అధ్యక్షతన శనివారం జరగుతుందని రాంబిల్లి ఎంపీడీవో జయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విధిగా హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు అప్పారావుకు సత్కారం



అప్పారావును సత్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ, తదితరులు

మునగపాక: పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన మునగపాకకు చెందిన పిల్లి అప్పారావును శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి పాటు పడాలన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అప్పారావు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజుకు, డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బోడకుర్తి గణేష్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొడ్డేడ మహేష్, పార్టీ నాయకులు ఆడారి సంతోష్‌కుమార్, పెంటకోట రాము, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

పని చేసే ప్రాంతంలో సదుపాయాలు ఎక్కడ?

- అధికారులపై సీపీఎం నాయకుల ఆగ్రహం
- రసాభాసగా మునగపాక సామాజిక తనిఖీ ప్రజావేదిక



ఉపాధి హామీ పథకంలో సదుపాయాల కల్పనలో విఫలంపై అధికారులను నిలదీస్తున్న సీపీఎం నేతలు

మునగపాక: జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేసే ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, ఆళ్ల మహేశ్వరరావు, వీవీ శ్రీనివాసరావు, బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. మునగపాక మండల పరిషత్ హాలులో శుక్రవారం జరిగిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక రసాభాసగా సాగింది. ఉపాధి హామీ పథకంలో పారదర్శకత పాటించకపోవడం, పని చేసే ప్రాంతంలో బోర్డులు ఏర్పాటు చేయడం, పే స్లిప్‌లు అందించకపోవడం, తదితర అంశాల్లో అధికారుల నిర్లక్ష్యం సరికాదంటూ సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సామాజిక తనిఖీ ప్రజావేదికలో గుర్తించిన తప్పులకు బాధ్యులైన వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారనే వివరాలు సభ ముందు ఉంచాలని నిలదీశారు. పని దినాలను 200 రోజులకు పెంచడంతో పాటు కనీస వేతనం రూ.600 అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామాల వారీగా అధికారులు నివేదిక చదివి వినిపించారు. దీనిలో భాగంగా రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. పనుల్లో అవినీతి, అక్రమాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, అదనపు పీడీ రోజా రమణి, విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి, ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఇన్‌చార్జి ఏపీవో ఎరకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులంటే అంత చులకనా?

- పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఏకరువు
- ఎస్.రాయవరం సర్వసభ్య సమావేశంలో అధికారులపై ఆగ్రహం



సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందు



కాలం చెల్లిన మందులు ఎందుకిచ్చారని వైద్యాధికారిని ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ కాకర దేవి

ఎస్.రాయవరం: మండలంలో ప్రజాప్రతినిధులంటే అధికారులకు గౌరవం లేకుండా పనులు చేస్తున్నారని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఏకరువుపెట్టారు. వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు చేపట్టబోయే పనులు చెబుతుండగా.. ప్రభుత్వం మారిన తరువాత వచ్చిన అధికారులకు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారన్న సంగతి మరిచి టీడీపీ నాయకులు చెప్పిన పనులు, తీర్మానాలు లేకుండా చేస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు దుయ్యబట్టారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు, కూటమి నాయకులు కలిసి భవన నిర్మాణదారుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు కూటమి నాయకులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయించడమేమిటని ప్రశ్నించారు. ఇకపై గ్రామాల్లోకి అధికారులు వచ్చినప్పుడు సర్పంచులకు, ఎంపీటీసీలకు సమాచార ఇవ్వకుంటే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. అనంతరం పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరిని జెడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి ప్రశ్నించారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు కాలం చెల్లిన మందులు ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు. అటువంటివి పీహెచ్‌లోనే చెక్ చేసి తీసివేస్తామని ఆమె బదులిచ్చారు. ఇరిగేషన్ శాఖ ఏఈ భాను మాట్లాడుతూ చాలా గ్రామాల్లో చెరువులు, కాలువలు ఆక్రమణలు గురయ్యాయని, వాటిని తొలగించేందుకు అందరూ సహకరించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీరాజ్ ఏఈ దుర్గాశంకర మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మరో వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, బైపా శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, శానాపతి శ్రీరాములు, కొప్పిశెట్టి సత్యం, మైలపల్లి శ్రీనివాసరావు, కోశెట్టి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.